

నిత్యాన్నదానానికి విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి సీహెచ్ నరేష్‌బాజీ, వినీత దంపతులు మంగళవారం రూ.1,11,000 విరాళం సమర్పించారు.



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి మళ్ల వెంకట బెనర్జీ, నాగసత్య దంపతులు (అనకాపల్లి) మంగళవారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం గోదావరి తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 4,90945 క్యూసెక్కుల మిగుల జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

మండలాలకు చేరుతున్న క్రీడా సామగ్రి

రాయవరం: స్పోర్ట్స్ గ్రాంట్‌లో భాగంగా 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు ప్రభుత్వం క్రీడా సామగ్రి పంపిణీ చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,579 ప్రాథమిక, ప్రాథమికోన్నత, సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలలకు దీని పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. హయ్యర్ సెకండరీ స్కూల్స్‌కు వాలీబాల్స్, వాలీబాల్ నెట్, త్రోబాల్, త్రోబాల్ నెట్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, టెన్నికాయిట్ నెట్, స్కిప్పింగ్ రోప్స్, యోగా మ్యాట్లు, చెస్ సెట్లు, ఫుట్‌బాల్, షాట్‌పుట్ తదితర క్రీడా సామగ్రి అందజేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలకు తొమ్మిది రకాలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 13 రకాలు, సెకండరీ పాఠశాలలకు 14 రకాల క్రీడా సామగ్రి అందిస్తున్నారు. ప్రస్తుతం క్రీడా సామగ్రి ఆయా మండలాలకు చేరుకుంటోంది.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



రోహిత్‌సాయికృష్ణ



అనిరుథ్

రావులపాలెం: మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కాకినాడలో జరిగిన జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో అండర్–18 విభాగం నుంచి బి.రోహిత్ సాయికృష్ణ పోల్‌వాల్ట్‌లో మొదటి స్థానం సాధించాడు. అలాగే అండర్–14 విభాగంలో బి.అనిరుథ్ 60 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించాడు. వీరిద్దరూ త్వరలో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ ఎ.రవితేజ, ట్రైనర్ మహేంద్ర మంగళవారం తెలిపారు. క్రీడాకారులను డాక్టర్ భీమారెడ్డి, రెడ్డి డ్రగ్స్ అధినేత కొవ్వూరి నరేష్‌కుమార్‌రెడ్డి, పీఈటీలు రామకృష్ణ, రామారావు, సత్యనారాయణరెడ్డి అభినందించారు.

పని భారం తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దివాకర్

అమలాపురం రూరల్: రెవెన్యూ ఉద్యోగులపై పని భారం తగ్గించాలని రాష్ట్ర రెవెన్యూ జేఏసీ తీర్మానించింది. జిల్లాలో ఇటీవల రోజువారీ పనులతో పాటు ఎన్నికల విధులు, రీసర్వే, స్పందన తదితర వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు ఒకేసారి నిర్వహించాలంటూ జిల్లా అధికారులు, ప్రధానంగా ఒక అధికారి ఒత్తిడి చేస్తున్నారని, దీనిపై కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించింది. అమలాపురం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశానికి జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్యలు పరిష్కారం కాకుంటే ప్రత్యక్ష కార్యాచరణ తప్పదని చెప్పారు. సెలవు రోజులతో పాటు పండగల్లో కూడా పని చేయించటం చాలా ఇబ్బందిగా ఉందని చెప్పారు. సమావేశంలో గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, వీఆర్ఓల సంఘం, ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పలివెల అశోక్ ప్రసాద్, సాధనాల యల్లేశ్వరరావు, దాసరి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరి సిరులు కురవాలని..



ముమ్మిడివరంలోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న శాస్త్రవేత్తలు



వరి పరిశోధన కేంద్రంలో వరి వంగడాల ప్రదర్శన (పాత చిత్రం)

- అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటు దిశగా అడుగులు
- సూచనప్రాయంగా రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం
- మార్టేరు శాస్త్రవేత్తల పర్యటన
- ఐ.పోలవరంలో భూమి పరిశీలన
- ఏఆర్ఎస్‌తో ముంపు, ఉప్పునీటిని తట్టుకునే వంగడాలపై పరిశోధనలకు అవకాశం

సాక్షి, అమలాపురం: ఒకవైపు ముంపు.. మరోవైపు చొచ్చుకు వచ్చే సముద్ర ఉప్పు జలాల ముప్పు.. ఖరీఫ్‌లో అధిక వర్షాలు.. తుపాన్లు.. రబీలో శివారుకు నీటి ఎద్దడి.. ఇలా చెప్పుకొంటూ పోతే గోదావరి డెల్టాలో వరి రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రాష్ట్ర ప్రభుత్వం పలు రకాలుగా ఆదుకుంటున్నా.. సాగును ప్రోత్సహిస్తున్నా.. ముంపు, ఉప్పు నీరు వరి రైతులను నిలువునా ముంచేస్తున్నాయి. ఈ కారణంగా రైతులు ఏటా వందల ఎకరాల్లో వరికి దూరమవుతున్నారు. వరి దిగుబడి పెంచడంతో పాటు.. దీని సాగును లాభసాటిగా మార్చేందుకు సిద్ధమైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి అనుబంధంగా జిల్లాలో అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ (ఏఆర్ఎస్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీని ఏర్పాటుపై నివేదిక తయారు చేసేందుకు మార్టేరు పరిశోధన స్థానం నుంచి వచ్చిన బృందం మంగళవారం జిల్లాలో పర్యటించింది.

సీఎంఓ సూచనతో..

జిల్లాలో మొత్తం ఆయకట్టు గోదావరి డెల్టా పరిధిలోనే ఉంది. సుమారు 2.30 లక్షల ఎకరాల వరి ఆయకట్టు ఉందన్నది అధికారుల లెక్క. దశాబ్దాల కాలంగా ఇక్కడ వరి సాగు గిట్టుబాటు కావడం లేదు. వర్షాలకు చేలు ముంపు బారిన పడడం, తీరంలో సముద్ర 'అల'జడికి ఉప్పు నీరు చొచ్చుకు రావడం, ఆక్వా సాగుతో ఉప్పు నీటి ప్రభావం వంటి కారణాలతో దిగుబడి పడిపోయింది. తూర్పు డెల్టాలో ఖరీఫ్‌లో ఎకరాకు సగటు దిగుబడి 35 బస్తాలు (బస్తా 75 కేజీల చొప్పున 26.25 క్వింటాళ్లు) కాగా, కోనసీమలో గత ఐదేళ్లుగా సగటు దిగుబడి ఎగువన 25 బస్తాలు (18.75 క్వింటాళ్లు), తీర ప్రాంతంలో 15 బస్తాలు (11.25 క్వింటాళ్లు) మాత్రమే ఉంది. దీనివలన ఇక్కడి రైతులకు వరి సాగు గిట్టుబాటు కావడం లేదు. 2011లో రైతులు సాగు సమ్మె చేయడానికి ఇదే పెద్ద కారణం. ఏటా సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగుకు దూరంగా ఉంటున్నారు. దీనిపై కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు(బాబీ)లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పలు నివేదికలు పంపించారు. ముంపును, ఉప్పును తట్టుకునే వరి వంగడాలు కనిపెట్టాలని, వరి రైతుల ఆదాయం పెరిగేలా చూడాలని, ఇందుకు ఏఆర్ఎస్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ఏఆర్ఎస్ ఏర్పాటుపై నివేదిక సిద్ధం చేయాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌కు సూచించింది.

బృందం పర్యటన

ఈ నేపథ్యంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎల్.ప్రశాంతి సూచన మేరకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు ప్రాంతీయ పరిశోధన స్థానం నుంచి ఒక బృందాన్ని కోనసీమకు పంపించారు. ప్రిన్సిపల్ సైంటిస్టులు డాక్టర్ టి.శ్రీనివాస్ (రైస్), డాక్టర్ కె.ఎం.దక్షిణామూర్తి (ఆగ్రో), డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ (సాయిల్ సైన్స్)తో పాటు జిల్లా డార్ట్ సైంటిస్టు డాక్టర్ కె.ప్రదీప్ కుమార్ ఈ బృందంలో ఉన్నారు. వీరు ముమ్మిడివరంలో వ్యవసాయ అధికారులు, డార్ట్ సెంటర్ శాస్త్రవేత్తలతో చర్చించారు. జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, ఇతర వ్యవసాయ అధికారులతో చర్చించారు. ఐ.పోలవరంలో ఏఆర్ఎస్ ఏర్పాటుకు అనువుగా ఉండే భూమిని పరిశీలించారు. వరి సాగులో ఎదురవుతున్న ఇబ్బందులపై ఇక్కడి రైతులతో చర్చించారు. ఈ బృందం వెంట జిన్నూరి బాబీ, వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు కూడా ఉన్నారు. శాస్త్రవేత్తలు ఇక్కడ నీరు, మట్టి నమూనాలు సేకరించారు. వీటిని పరిశీలించిన అనంతరం వారం పది రోజుల్లో యూనివర్సిటీకి పూర్తి స్థాయి ప్రాజెక్టు రిపోర్టు అందజేయనున్నారు. వీరు ఇచ్చే నివేదిక ఆధారంగా ఇక్కడ ఏఆర్ఎస్ ఏర్పాటుపై ఉన్నతాధికారులు పరిశీలిస్తారు.

నాడు పరిశీలించి.. నేడు పరిష్కరిస్తూ..

కోనసీమ రైతులు 2011లో సాగు సమ్మె చేశారు. సుమారు 13 మండలాల్లో 93 వేల ఎకరాల్లో సాగుకు దూరమయ్యారు. నాడు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడ పర్యటించారు. ఇక్కడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. వారు సాగుకు దూరమవుతున్న కారణాలు తెలుసుకున్న ఆయన.. ముఖ్యమంత్రి అయిన తరువాత ఒక్కొక్క సమస్యనూ పరిష్కరిస్తూ వస్తున్నారు. ఖరీఫ్‌కు ముందస్తుగా సాగునీరు విడుదల చేయడం, రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించడం, రైతులకు పెట్టుబడి తగ్గేలా రైతుభరోసా సాయం అందించడం, పంట నష్టపోయిన రెండు మూడు నెలల్లోనే పరిహారం అందించడం వంటి చర్యలు తీసుకున్నారు. దీనికి కొనసాగింపుగా వరి దిగుబడి పెరిగేలా ముంపు, ఉప్పు నీటిని తట్టుకునే వంగడాలను రూపొందించడం, వరి సాగును లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా ఏఆర్ఎస్ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకారం తెలిపారు. దీనిపై స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శుక్లా, జేసీ నూపుర్ అజయ్

అమలాపురం రూరల్: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల నమోదు అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో మంగళవారం వెలగపూడి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణపై క్లెయిములు, పరిష్కారం, రీవెరిఫికేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ, 138 క్లెయిములకు సంబంధించి తప్పుగా తొలగించినట్లు తనిఖీలో గుర్తించామన్నారు. జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, వ్యక్తులు 25,241 ఫిర్యాదులు చేశారని, వీటిని పరిష్కరించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. 2,259 వరకూ బహుళ నమోదులు ఉన్నాయని చెప్పారు. 17,285 ఓటర్లు మరణించినట్టు రాగా.. తనిఖీలో ఇప్పటి వరకూ 12,565 గుర్తించామని అన్నారు. అమలాపురం, రామచంద్రపురం నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు రాలేదన్నారు. ఫారం–6 ఐదు శాతం, ఫారం–7, 8 దరఖాస్తులు చెరో 13 శాతం చొప్పున పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ శుక్లా తెలిపారు. ఇంటింటి సర్వే, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పూర్తయ్యిందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 1,641 పోలింగ్ కేంద్రాలుండగా, వీటిలో 46 కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న పాఠశాలలకు మార్చామని వివరించారు. ఆన్‌లైన్‌లో ఓటరు గుర్తింపు కార్డులు 23,849 జనరేట్ చేయగా, ఇప్పటి వరకూ 23,185 కార్డులు ప్రింట్ అయి వచ్చాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జేసీ ఎస్.నూపుర్ అజయ్, డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు, ఆర్డీఓలు వసంతరాయుడు, ఎం.ముక్కంటి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు సేవలు

- రామచంద్రపురంతో పాటు మండపేట, అనపర్తి నియోజకవర్గాలకు మేలు
- ప్రారంభించిన మంత్రి చెల్లుబోయిన వేణు
- వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వెల్లడి



ఏరియా ఆసుపత్రి వద్ద బ్లడ్ బ్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంకును రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గడచిన నాలుగేళ్లలో 53 వేల మంది వైద్య సిబ్బందిని నియమించి, వైద్య సేవలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. వైద్యం అందక ఏ ఒక్కరూ బాధ కూడదనే ఉద్దేశంతో.. వైద్య సేవలను విస్తృతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు. ఇందులో భాగంగా దాతల సహకారంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ బ్లడ్ బ్యాంకు సేవలను రామచంద్రపురంతో పాటు మండపేట, అనపర్తి నియోజకవర్గాల ప్రజలు కూడా వినియోగించుకోవచ్చని మంత్రి వేణు అన్నారు. గతంలో ఎవరికైనా రక్తం అవసరమైతే కాకినాడ వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. వారి కష్టాలు తీరేలా ఇక నుంచి అవసరమైన రక్తం స్థానికంగానే అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఏరియా ఆసుపత్రి సేవలను 24 గంటలూ అందే విధంగా మెరుగు పరిచామన్నారు. ఇక్కడ రక్త పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ ఉన్నాయని, మరిన్ని సేవలు అందించే విధంగా ప్రతిపాదనలు చేస్తున్నామని తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సౌకర్యార్థం డయాలసిస్ సెంటర్‌తో పాటు మరో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి వేణు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు తొగరు మూర్తి, చెల్లుబోయిన ప్రకాశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతపల్లి నాగేశ్వరావు, కౌన్సిలర్లు వాడ్రేవు సాయి ప్రసాద్, తోట అమ్మాజీ, ప్రముఖ వ్యాపారవేత్తలు అడ్డూరి జగన్నాథవర్మ, కొవ్వూరి తాతారెడ్డి, మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీ రావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రుడు, వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతే లక్ష్యంగా..

- మద్యం దుకాణాల్లోనూ డిజిటల్ లావాదేవీలు
- జిల్లాలోని 97 షాపుల్లో అమలు
- మోసాలకు చెక్

రాయవరం: అన్ని రంగాల్లోనూ డిజిటల్ లావాదేవీలు పెరిగిన నేపథ్యంలో ఈ విధానాన్ని మద్యం దుకాణాలకు కూడా వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. లావాదేవీలు పారదర్శకంగా ఉండేందుకు అన్ని మద్యం షాపుల్లోనూ పేటీఎం, ఎస్‌బీఐకి చెందిన ఫోన్‌పే సౌకర్యం కల్పించింది. తద్వారా ప్రతిపక్షాల తప్పుడు విమర్శలకు కూడా చెక్ పెట్టింది. జిల్లాలో 97 మద్యం దుకాణాలు, 10 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇక నుంచి వీటిల్లో ఏటీఎం కార్డు, స్వైపింగ్, యూపీఐ, క్యూఆర్ కోడ్ స్కానింగ్ వంటి వాటి ద్వారా డిజిటల్ చెల్లింపులు చేసుకునే వీలు కల్పించారు. డిజిటల్ లావాదేవీలను అంగీకరించే బాధ్యతను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)కి అప్పగించారు. ఇప్పటి వరకూ ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీబీసీఎల్) మద్యం కొనుగోలుదారుల నుంచి నగదు తీసుకుని ఎస్‌బీఐలో డిపాజిట్ చేస్తోంది. ఈ డబ్బు మరుసటి రోజు ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది. డిజిటల్ లావాదేవీలు ఆరంభించడం వల్ల మద్యం దుకాణాల్లో మోసాలకు చెక్ పెట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. అలాగే మద్యంపై ఎంత ఆదాయం వస్తుందో స్పష్టమైన లెక్కలు కూడా వస్తాయి. మద్యం బ్రాండ్, వాల్యూమ్, ధర, అవుట్‌లెట్, కస్టమర్ గుర్తింపు, ఇతర వివరాలను ట్రాక్ చేసేందుకు డిజిటల్ చెల్లింపులు సహాయపడతాయి. షాపుల్లోని మద్యం పక్కదారి పట్టకుండా స్పష్టమైన లెక్కలు తెలుస్తాయి. ఇప్పటి వరకూ జరుగుతున్న మద్యం విక్రయాలకు సంబంధించిన నగదు ఆయా షాపుల్లోనే ఉంటోంది. దీనివలన నగదు పక్కదారి పట్టడం, చోరీ అవడం వంటి ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఇటువంటి సమస్యలను అధిగమించేందుకు డిజిటల్ పేమెంట్స్ ఎంతో ఉపయోగపడనున్నాయి.

పారదర్శకత కోసం..



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ లావాదేవీలు ప్రారంభించాం. క్రెడిట్ కార్డులపై మాత్రం నిబంధనల మేరకు చార్జీలు ఉంటాయి. జిల్లాలోని 97 మద్యం దుకాణాల ద్వారా ప్రతి రోజై సరాసరిన రూ.1.20 కోట్ల అమ్మకాలు చేపడుతున్నాం. డిజిటల్ పేమెంట్లు చేయలేని వారికి నగదు రూపంలో విక్రయిస్తున్నాం. భవిష్యత్తులో పూర్తి స్థాయిలో డిజిటల్ అమ్మకాలు చేపడతాం.

– దశమంతరావు, జిల్లా మేనేజర్, ఐఎంఎల్ మద్యం డిపో, అమలాపురం

పేదల బతుకుల్లో పింఛన్ కాంతులు



- అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక
- ఒకటో తేదీనే అందిస్తూ ఆర్థిక భరోసా
- గత ప్రభుత్వంలో పింఛన్ల సంఖ్య 2,30,914
- సీఎం జగన్ ప్రభుత్వంలో 2,83,401కు పెరిగిన లబ్ధిదారులు
- నాలుగేళ్లలో గణనీయంగా కొత్త పింఛన్ల మంజూరు

కోనసీమ జిల్లాలో పెరిగిన లబ్ధిదారులు.. లబ్ధి (రూ.కోట్లలో)

గత ప్రభుత్వం		ప్రస్తుత ప్రభుత్వం	
లబ్ధిదారులు	లబ్ధి	లబ్ధిదారులు	లబ్ధి
2,00,360	273.78	2,46,922	321.44

జనవరి-2021		జూలై-2022		జనవరి-2023		సెప్టెంబర్-2023	
లబ్ధిదారులు	లబ్ధి	లబ్ధిదారులు	లబ్ధి	లబ్ధిదారులు	లబ్ధి	లబ్ధిదారులు	లబ్ధి
6,017	1.57	10,998	2.47	8,299	2.28	12,470	3.45

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఏ ఆధారం లేని లక్షలాది మంది నిరుపేదలకు పింఛనే జీవనాధారం. అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు.. ఇలా ఎంతోమంది జీవితాల్లో పెన్షన్ వెలుగులు నింపుతోంది. పేదరికమే ప్రామాణికంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రస్తుత ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 2,30,914 మంది లబ్ధిదారులకు రూ.2,540 కోట్ల సాయం అందేది. జగన్ ప్రభుత్వ సారథిగా పగ్గాలు చేపట్టాక నాలుగేళ్లలో కొత్త పింఛన్లు గణనీయంగా మంజూరు చేశారు. ప్రస్తుతం జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 2,83,401కు పెరిగింది. వారికి ప్రభుత్వం రూ.7,802 కోట్ల మేర ఆర్థిక సాయం అందజేస్తోంది.

నాడు ఇలా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్త పింఛన్ మంజూరవ్వాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. కమ్యూనిటీ హాళ్లు, ఆలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు పడిగాపులు పడేవారు. ఒక్కోసారి వారం రోజుల వరకూ కూడా పెన్షన్ అందేది కాదు. ఇలాంటి బాధలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరమగీతం పాడారు. అర్హతలున్నా సాంకేతిక కారణాలతో పింఛన్ అందక కష్టాల కడలిలో ఎదురీదుతున్న వారి కోసమే గత నెలలో ప్రత్యేకంగా ద్వైవార్షిక నగదు మంజూరు పథకం తీసుకు వచ్చి అక్కున చేర్చుకున్నారు. దాదాపు అన్ని ఆర్థిక, ఆర్థికేతర అంశాలకు నెల తిరగకుండానే పరిష్కారం చూపించి భరోసా కల్పించారు. ఫలితంగా జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ సాయం అందుతోంది. ప్రతి రెండు మూడు కుటుంబాల్లో పింఛన్ లబ్ధిదారులు ఉంటున్నారు. ఒకటో తేదీన తెల్లారకుండానే తంచనుగా గడప చెంతకే పెన్షను నేరుగా వస్తూండటంతో వారి ఆనందానికి అవధులు లేవు.

వస్తుందా రాదా అనుకున్నా..



ఆలమూరుకు చెందిన కొండేపూడి విజయలక్ష్మి వయస్సు 47 సంవత్సరాలు. కుమార్తె, కుమారుడు ఉన్నారు. జనవరిలో భర్త సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటికే కుమార్తెకు పెళ్లి చేసి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారు. కుమారుడు ప్రవీణ్ లారీ డ్రైవర్. అతనికి వచ్చే చాలీచాలని జీతంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. పింఛన్ వస్తే కొంత చేదోడుగా ఉంటుందని విజయలక్ష్మి ఆశ పడింది. ఎక్కడికీ తిరగాల్సిన పని లేకుండా వలంటీర్ వచ్చి దరఖాస్తు చేయించగా కొత్త పింఛను మంజూరైంది. పింఛన్ సొమ్మును వలంటీర్ నేరుగా ఇంటికి తీసుకువచ్చి ఇవ్వడం కొండంత భరోసాగా ఉందంటూ.. ఇందుకు కారకులైన సీఎం జగన్‌కు విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపింది.

తప్పు సరిచేసి మంజూరు చేశారు



గత టీడీపీ ప్రభుత్వంలో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. నేను, నా భార్య కూలి పనులు చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్నాం. నాకు సెంటు భూమి లేకపోయినా రెండెకరాలున్నట్టు రికార్డుల్లో ఉండటంతో పింఛను రావడం లేదు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు దృష్టికి నా సమస్య తీసుకువెళ్లాను. ఆన్‌లైన్ నుంచి భూమి వివరాలు తొలగించడంతో వృద్ధాప్య పింఛన్ వచ్చింది. అవసరానికి ప్రతి నెలా ఒకటో తేదీన రూ.2,750 వస్తుందనే నమ్మకం ఏర్పడింది.

– కొంబత్తుల రామారావు, కొంబత్తులవారిపేట, అంబాజీపేట

పంచ్ కొడితే పతకమే..

- బాక్సింగ్‌లో రాణిస్తున్న పేదింటి క్రీడాకుసుమం
- జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అనేక పతకాలు
- ప్రపంచ, కామన్‌వెల్త్ బాక్సింగ్ పోటీలకు సిద్ధమవుతున్న నస్రీనా
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆ అమ్మాయి బరిలోకి దిగితే పతకం సొంతం కావల్సిందే.. పంచ్ కొడితే ప్రత్యర్థి బెంబేలెత్తాల్సిందే.. ప్రతిభకు పేదరికం అడ్డం రాదని నిరూపించింది షేక్ నస్రీనా. బాక్సింగ్ బరిలో ప్రత్యర్థులను తన కిక్‌తో గడగడలాడించి 15 బంగారు, 2 రజత పతకాల్ని తన ఖాతాలో వేసుకుంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణిస్తోంది. ప్రతిభకు తగిన ప్రోత్సాహం లేక ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపులు చూస్తోంది. ప్రభుత్వ తోడ్పాటు ఉంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధిస్తానని ధీమాగా చెబుతోంది. ఆమె పేరు షేక్ నస్రీనా. ఊరు రాజమహేంద్రవరం. ఆ నగరంలోని ఐఎల్‌టీడీ ప్రాంతానికి చెందిన నస్రీనా తండ్రి షేక్ మస్తాన్ చిరు వ్యాపారం చేస్తుంటారు. తల్లి షేక్ మీరా టైలరింగ్ చేస్తూ ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు.


నేపాల్‌లో జరిగిన పోటీల్లో ప్రత్యర్థికి పంచ్ కొడుతున్న నస్రీనా


సాధించిన పతకాలతో బాక్సింగ్ క్రీడాకారిణి షేక్ నస్రీనా

బాక్సింగ్‌లో ఓనమాలు ఇలా..

నస్రీనా చిన్నాన్న హైదరాబాద్‌లో ఉంటారు. ఆయన ఇంటికి 2014లో వెళ్లిన ఆమె.. అక్కడ తన ఈడు పిల్లలు వివిధ క్రీడల్లో రాణించడం చూసి స్ఫూర్తి పొందింది. బాక్సింగ్‌లో విశ్వవిజేత టైసన్ పోరాడటాన్ని టీవీల్లో చూసి ఈ క్రీడపై ఆసక్తి పెంచుకుంది. ఆడపిల్లలకు క్రీడలు ఎందుకని ఇరుగుపొరుగు వారు నిరుత్సాహపరిచారు. కానీ కుమార్తె కోరికను తల్లిదండ్రులు అంగీకరించారు. దీంతో నస్రీనా హైదరాబాద్‌లో చిన్నాన్న ఇంటి వద్దనే ఉండి తొమ్మిదో తరగతి చదువుతూ, ఎల్‌బీ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) బాక్సింగ్ కోచ్ ఓంకార్ యాదవ్ వద్ద ఈ క్రీడలో ఓనమాలు నేర్చుకుంది. తరువాత తల్లిదండ్రులు రాజమహేంద్రవరంలో ఉండటంతో హైదరాబాద్ నుంచి ఇక్కడకు వచ్చేసింది. జిల్లాకు చెందిన అంతర్జాతీయ బాక్సింగ్ కోచ్ చిట్టూరి చంద్రశేఖర్ వద్ద శిక్షణకు చేరింది. నస్రీనా పట్టుదల, ఆట పట్ల ఆసక్తి, చలాకీతనాన్ని గుర్తించిన చంద్రశేఖర్ ఆమెకు బాక్సింగ్‌లో మెళకువలు నేర్పించారు. కౌంటర్ ఎటాక్, మిక్సింగ్, ఫుట్‌వర్క్, స్పీడ్, స్టామినా, ఫిట్‌నెస్‌లో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రెండేసి గంటల చొప్పున శిక్షణ ఇచ్చి, మేటి క్రీడాకారిణిగా తీర్చిదిద్దారు. దీంతో తొమ్మిదో తరగతి నుంచే నస్రీనా పాఠశాల స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం మొదలు పెట్టింది. శాప్ ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొని మరిన్ని మెళకువలు నేర్చుకుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో రాజమహేంద్రవరానికే చెందిన సినీ నటుడు ఆలీ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్‌లు నస్రీనా శిక్షణకు కొంత ఆర్థిక సహాయం అందించి, ప్రోత్సహించారు. ప్రస్తుతం నస్రీనా రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతోంది. అలాగే త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి కామన్‌వెల్త్, ప్రపంచ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యేందుకు ఢిల్లీలో అంతర్జాతీయ కోచ్, ఒలింపియన్ హయతుల్లా నైబీ వద్ద శిక్షణ పొందుతోంది.

ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధిస్తా..

బాక్సింగ్ నేర్చుకుంటున్న తొలి రోజుల్లో కంటిపై గాయం కావడంతో వద్దన్న అమ్మానాన్న ఇప్పుడు నన్ను ప్రోత్సహిస్తున్నారు. నా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అంతర్జాతీయ పోటీల ఎంపికకు తీసుకునే శిక్షణకు ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందిస్తే ఒలింపిక్స్‌లో తప్పకుండా బంగారు పతకం సాధిస్తాను.

– షేక్ నస్రీనా

ప్రోత్సాహం అందిస్తే పతకం ఖాయం

నేను తొలి నుంచీ కుస్తీ పోటీల్లో పాల్గొనేవాడిని. ఆడపిల్లలకు కుస్తీ పోటీలు ఎందుకులే అనుకున్న తరువాత నస్రీనాలో ఉన్న ఉత్సాహం చూసి ప్రోత్సహించాం. ఇప్పుడు ఎన్నో బంగారు పతకాలు సాధిస్తోంది. సామాన్య కుటుంబం కావడంతో నస్రీనాకు సరైన ఆహారం, ఇతర సౌకర్యాలు అందించలేకపోతున్నాం. నస్రీనాకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తే దేశానికి బంగారు పతకం తీసుకురావడం ఖాయం.

– షేక్ మస్తాన్, షేక్ నస్రీనా తండ్రి

సాధించిన విజయాలు


తల్లి షేక్ మీరాతో నస్రీనా

- మధురైలో జరిగిన ఇండియన్ అమెచ్యూర్ బాక్సింగ్ ఫెడరేషన్ పోటీల్లో బంగారు పతకంతో పాటు బెస్ట్ బాక్సర్ పతకం.
- ఏడు రాష్ట్రాల మహిళల సౌత్ జోన్ పోటీల్లో 64, 66 కేజీల విభాగాల్లో బంగారు పతకం.
- అంతర్జాతీయ స్థాయిలో నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన బాక్సింగ్ పోటీల్లో పసిడి పతకం.
- 2021లో మహారాష్ట్రలోని పుణేలో జరిగిన ప్రొఫెషనల్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం.
- 2022లో జరిగిన ఏపీ స్టేట్ సీనియర్ బాక్సింగ్ పోటీలో రెండు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపిక.
- ఇటీవల తిరుపతిలో జరిగిన ఏపీ సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం.


బాక్సింగ్ పంచ్ పొజిషన్‌లో క్రీడాకారిణి నస్రీనా

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆలమూరు: జొన్నాడ సెంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (70) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం ఆ వ్యక్తి కొంత కాలం నుంచి జొన్నాడ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా అతడికి మతిస్థిమితం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యం క్షీణించి తారకరామా కాలనీ సమీపాన మంగళవారం అతడు మృతి చెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఎల్ శ్రీను నాయక్ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గండేపల్లిలో..

గండేపల్లి: జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వృద్ధుడి (70) మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. వారి కథనం ప్రకారం.. గండేపల్లి శివారున విశాఖ వైపు వెళ్లే రోడ్డు పక్కన ధాబా వద్ద ఈ మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహంపై ఎరుపు రంగు టీ షర్ట్, లేతరంగు నైట్ ఫ్యాంట్ ఉన్నాయి. వీఆర్‌ఓ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 08852–294100, 94409 04841 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ మృతి

రాయవరం: రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ మృతి చెందిన సంఘటన రాయవరం మండలం పసలపూడి వద్ద చోటు చేసుకుంది. రామచంద్రపురం మండలం వెలంపాలెం శివారు కుండాలమ్మ చెరువు ప్రాంతానికి చెందిన పంపన శ్రీను (33) పసలపూడిలో అత్తవారింటి వద్ద భార్యా పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి మోటార్ సైకిల్‌పై వెళ్తున్న అతడు పసలపూడి వద్ద ఆగి ఉన్న మరో బైక్‌ను ఢీకొట్టాడు. అనంతరం తనకేమీ కాలేదంటూ ఇంటికి వెళ్లి నిద్రించాడు. మంగళవారం తెల్లవారుజామున ఊపిరి పీల్చుకోవడం కష్టమవడతంతో భార్య ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే శ్రీను మరణించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జి.నరేష్ తెలిపారు.

భార్య చేతిలో హతం

- చెంపపై కొట్టడంతో మృతి చెందిన భర్త
- పాశర్లపూడి బాడవలో ఘటన

మామిడికుదురు: పండగ వేళ పాశర్లపూడి బాడవలో దారుణం చోటు చేసుకుంది. వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన ఘర్షణలో భార్య చేతిలో భర్త హత్యకు గురయ్యాడు. వివరాలివీ.. పాశర్లపూడి బాడవ పల్లవపాలేనికి చెందిన కొల్లు సాయికుమార్ (24).. అదే గ్రామానికి చెందిన యువతిని ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. సాయికుమార్ ఇళ్ల సీలింగ్ పనులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా.. అతడి భార్య.. అదే గ్రామానికి చెందిన కొల్లు వెంకటేష్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇదే విధంగా ఈ నెల 17వ తేదీ రాత్రి ఇద్దరి మధ్యా ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో సాయికుమార్ చెంపపై భార్య గట్టిగా కొట్టడంతో అతడు మృతి చెందాడు. ఈ మేరకు హతుని తండ్రి కొల్లు వీరపండు నగరం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటనపై పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యాన నగరం ఎస్సై పి.సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సాయికుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.


సాయికుమార్ మృతదేహం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగ్గంపేట: ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ కథనం ప్రకారం.. నరేంద్రపట్నం గ్రామానికి చెందిన కండిపల్లి లోవరాజు (34) సోమవారం జగ్గంపేటలోని తన బావగారి కుమారుడి పుట్టిన రోజు వేడుకకు తన బావమరిది టంకు పైడియ్యతో కలిసి మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా నరేంద్రపట్నం శివారున వారి మోటార్ సైకిల్ ఆగిపోయింది. చీకట్లో దాన్ని మరమ్మతు చేస్తుండగా, నరేంద్రపట్నం నుంచి మరో మోటార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తి లోవరాజును బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో లోవరాజు తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని బావమరిది పైడియ్య, కుటుంబ సభ్యులు కలిసి ఏలేశ్వరం ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లోవరాజు మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య రూపవతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పూటుగా తాగి.. యువకులతో వాగ్వాదం

ఘర్షణలో ఆటో డ్రైవర్ మృతి

కాకినాడ క్రైం: మద్యం మత్తులో నోరు జారిన ఘటనలో ఓ తాగుబోతు ముగ్గురు వ్యక్తుల చేతిలో దాడికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. వివరాలివీ.. కాకినాడ నూకాలమ్మ మాన్యానికి చెందిన ఆటో డ్రైవర్ నీలపు నాగరాజు (46) మద్యానికి బానిసయ్యాడు. భానుగుడి జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలోని ప్రకాశం వీధిలో ఉన్న ఓ టీ దుకాణం వద్ద సోమవారం సాయంత్రం మద్యం మత్తులో టీ ఆర్డర్ చేశాడు. ఆ సమయంలో అక్కడికి ఇద్దరు యువకులు వచ్చారు. వారిని టైం ఎంతైందని అడిగాడు. వారు చెప్పేసరికి వినిపించలేదంటూ గదమాయించాడు. మళ్లీ చెప్పమంటూ దూషించాడు. యువకులు స్పందించకపోయేసరికి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో ఇరు వర్గాల మధ్య వాదులాట జరిగింది. మరో వ్యక్తి జోక్యం చేసుకొని, మద్యం మత్తులో ఉన్న నాగరాజును తప్పు చేస్తున్నావంటూ వారించి అతడి ఆటోలో ఎక్కించాడు. ఆటోలో ఉన్న నాగరాజు మళ్లీ దూషిస్తుండటంతో ఆ ఇద్దరు యువకుల్లో ఒకరు తన సోదరుడికి విషయం చెప్పాడు. అతడు అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే ఆటో దిగి అరుస్తున్న నాగరాజుపై ముగ్గురు యువకులూ దాడి చేశారు. నాగరాజు కింద పడిపోవడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. టూ టౌన్ సీఐ నాగేశ్వర్ నాయక్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని, నాగరాజును జీజీహెచ్‌కు తరలించారు. అయితే, అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగరాజుకు గతంలో ద్విచక్ర వాహన ప్రమాదం జరగడంతో రెండుసార్లు మెదడుకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగిందని, కపాల భాగం బలహీనంగా ఉందని వైద్యులు చెప్పారు. దాడికి పాల్పడిన యువకులు విజయ్, శేఖర్‌తో పాటు మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ నాయక్ తెలిపారు.


అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే చిట్టిబాబు దంపతులకు అర్చకుల ఆశీర్వచనం


అయినవిల్లి మాడ వీధుల్లో సాగుతున్న స్వామి వారి ఊరేగింపు

వినాయక వైభవం

- ఘనంగా చవితి మహోత్సవాలు
- కిక్కిరిసిన అయినవిల్లి, బిక్కవోలు ఆలయాలు

అయినవిల్లి/బిక్కవోలు: 'జై గణేశ' అంటూ భక్తి పారవశ్యంతో భక్తులు చేసిన నినాదాలు ప్రతిధ్వనించాయి. వినాయక చవితి నవరాత్ర మహోత్సవాలు కన్నుల పండువగా సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రసిద్ధ గణేశ క్షేత్రాలైన అయినవిల్లి, బిక్కవోలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారికి కానుకలు, మొక్కుబడులు చెల్లించారు. అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని సోమ, మంగళవారాల్లో అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన 12 మంది పండితులు వివిధ పండ్ల రసాలు, పంచామృతాలతో స్వామివారిని విశేషంగా అభిషేకించారు. లక్ష దూర్వార్చన, నిత్య లక్ష్మీగణపతి హోమం వంటి విశేష క్రతువులు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పండితులు మట్టి గణపతిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ గుత్తుల నాగేశ్వరరావు (నాగబాబు), ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు (సతీష్‌రాజు) పర్యవేక్షించారు. స్వామివారిని సాయంత్రం మాడ వీధుల్లో ఊరేగించారు. పంచహారతులు ఇచ్చారు. ఉత్సవాల సందర్భంగా స్వామి వారిని, ఆలయ ప్రాంగణాన్ని వివిధ పుష్పమాలికలు, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. స్వామివారిని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తదితరులు దర్శించుకున్నారు.

బిక్కవోలులోని ప్రాచీన క్షేత్రం శ్రీ లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి భారీ క్యూలలో వేచి ఉండి మరీ స్వామి వారిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. సోమవారం వేకువన 1.29 గంటలకు తీర్థపు బిందె సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఈ ఉత్సవాలకు సోమవారం ఉదయం 10.46 గంటలకు ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, విశాలక్షి దంపతులు కలశ స్థాపన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ గణపతి స్వామిని విశేషంగా అలంకరించారు. స్వామి వారిని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఈఓ రామలింగ భాస్కర్ తదితరులు కూడా స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.


బిక్కవోలులో కిక్కిరిసిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి


అయినవిల్లిలో విఘ్నేశ్వరుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

ట్విన్.. ఫన్



కొబ్బరి కాయను కొడితే రెండు చిప్పలవ్వడం సర్వసాధారణం. అదే కొబ్బరి కాయలో నాలుగు చిప్పలుండటం వింతే కదా! మాచవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రాజరాజేశ్వరీ పార్వతీ సమేత పరమేశ్వర స్వామి వారిని ఓ భక్తుడు దర్శించుకున్నాడు. అభిషేకానికి ఆయన ఇచ్చిన కొబ్బరి కాయను అర్చకుడు మాచరి రాజు రెండు ముక్కలుగా కొట్టగా.. అందులో నాలుగు కొబ్బరి చిప్పలు దర్శనమిచ్చాయి. దీనిని భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఇటువంటి కాయలను ట్విన్ కోకోనట్ అంటారని అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు చెప్పారు. కొబ్బరిలో సాధారణంగా డబుల్ ఫలదీకరణ ప్రక్రియలో డిప్లాయిడ్ పిండం, ట్రిప్లాయిడ్ ఎండోస్పెర్మ్ ఉన్న విత్తనాలు ఉంటాయని తెలిపారు. కొన్నిసార్లు ఉత్పరివర్తన లేదా జన్యుపరమైన తేడాల వలన ఇటువంటి కొబ్బరి కాయలు తయారవుతాయని చెప్పారు. - అంబాజీపేట

అందిన 'ద్రాక్ష'.. తియ్యన..

'అందని ద్రాక్ష పుల్లన' అంటారు. కానీ చేతికి అందుతున్న ఈ ద్రాక్ష చాలా తియ్యగా ఉంది. అంబాజీపేట మండలం మాచవరంలో 'పళని స్వామి గోలీ సోడా' పేరుతో 18 రకాల సోడాలు విక్రయించే వర్రే రామకృష్ణ ఇంటి వద్ద ఈ ద్రాక్ష పాదు సుమారు 10 మీటర్ల పొడవున పెరిగింది. షాపునకు స్వాగత లతలా అల్లుకున్న ఈ ద్రాక్ష పాదు గుత్తులు గుత్తులుగా కాపు కాస్తూ ఇక్కడకు వస్తున్న సోడా ప్రియులను, రోడ్డు మీద వెళ్లేవారిని ఆకర్షిస్తోంది. ద్రాక్షను పెంచేందుకు కోనసీమ జిల్లాలో అనుకూల వాతావరణం ఉంటుంది. అయినప్పటికీ చాలా మంది సరదాగా దీనిని పెంచుతారు. కానీ, ఇక్కడ పెరిగే ద్రాక్ష పుల్లగా, చేదుగా ఉంటుంది. అయితే, రామకృష్ణ ఇంటి వద్ద పెరిగిన ద్రాక్ష మాత్రం తియ్యగా ఉండటం విశేషం. 'మా ఇంటి పక్కవారి వద్ద ఉన్న పాదుకు అంటు కట్టాను. వారికి ద్రాక్ష కాయలేదు కానీ నా వద్ద ఉన్న పాదుకు పెద్ద సంఖ్యలో ద్రాక్ష గుత్తులు కాయడం సంతోషంగా ఉంది' అని రామకృష్ణ ఆనందంగా చెప్పారు.

- సాక్షి, అమలాపురం

